క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఏపీఓ బి.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. మస్టర్లు పరిశీలించి కూలీలకు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా కూలీలు గిట్టుబాటు కూలీ నగదు పొందేలా పనులు చేసుకోవాలన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



దేవదేవేరులను దర్శించుకుంటున్న భక్తులు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం నుంచి జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. వేదపండితులు గర్తపూజ, యంత్ర, విగ్రహ, గోపుర శిఖర కలశ, ధ్వజస్తంభ, ప్రతిష్టలు, మహాకుంభాభిషేకం, శాంతి కల్యాణం, గ్రామోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ

కావలి: పట్టణంలోని స్కిల్ హబ్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ , ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అసోసియేట్ ఎలక్ట్రిషియన్ విభాగంలో ఉచితంగా శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ సెంటర్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైనా, కాకపోయినా శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 53 రోజుల పాటు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణనిచ్చి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు 9032298581, 8464079143 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా నెహ్రూ వర్ధంతి



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి నిర్వహిస్తున్న నేతలు

ఆత్మకూరు: భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేవూరు శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వన్నం నాగరాజు, ఆత్మకూరు నాయకులు టి.మస్తానయ్య, సీహెచ్ అనీల్, సయ్యద్ రసూల్, వేణు, సతీష్, కుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు



డ్రిప్‌తో సాగుచేస్తున్న మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఉద్యాన పంటలైన బొప్పాయి, మామిడి, నిమ్మ, మిరప వంటి పైర్లు సాగు చేసే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఆత్మకూరు సబ్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొంగూరు, పడమటినాయుడుపల్లి, మర్రిపాడు, కేతిగుంట గ్రామాల్లో సాగులో ఉన్న పలు పంటలను శనివారం ఆయన క్షేత్ర పరిశీలన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యం చేపట్టేందుకు ముందుకొచ్చిన రైతులకు 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందజేస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు తమ కార్యాలయంలో సంప్రదించి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్ పైపుల కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపేంద్ర, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ముందు వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మర్రిపాడు సమీపంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. మర్రిపాడుకు చెందిన సంద్రా రాజశేఖర్ పొలానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి నెల్లూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరి సంక్షేమమే జగనన్న ఆశయం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

చేజర్ల (సోమశిల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతి ఒక్కరి సంక్షేమ బాధ్యతను తీసుకున్నారని, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి పరుస్తున్నారన్నారు. శనివారం అనంతసాగరం మండలంలోని గౌరవరంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు తమ కాలనీలో 50 మంది చిన్నారులు ఉన్నారని, కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు తమకు సాగు భూములు, ఇంటి స్థలాలు లేవని తెలియజేయడంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి స్థలాలు అందేలా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుంటా లలితమ్మ తనకు పింఛన్ అందజేయాలని, తన కుమారుడు దివ్యాంగుడని, సహాయం చేయాలని కోరింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లలితమ్మకు కొంత నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యాల సంపూర్ణమ్మ, మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ ఏ సుధాకర్‌రెడ్డి, కామిరెడ్డిపాడు ఎంపీటీసీ కే నర్శింహులు, గౌరవరం సర్పంచ్ సుబ్బారావు, సచివాలయ కన్వీనర్ బి.కొండయ్య, అనంతసాగరం సర్పంచ్ శోభ, బొమ్మవరం సర్పంచ్ కే లక్ష్మీదేవి, నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, ఈశ్వరయ్య, పెంచలయ్య, చంద్రశేఖర్ నాయుడు, వెంకటరమణయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- పశుఆరోగ్య సేవా వాహనం ప్రారంభం



పశు సంచార వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: పాడి పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే స్థానిక మండల ప్రజాపరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వాహనం అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాలకు తన సేవలను అందిస్తుందన్నారు. పశువులకు అత్యవసర సేవలకు రాష్ట్ర ప్రభుత్వం సంచార వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. పాడిరైతుల సౌకర్యం కోసం 1962 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారన్నారు. ఈ వాహనంలో పశు వైద్యులు, వైద్య సహాయకుడు ఉంటారన్నారు. ప్రాథమిక వైద్య సేవలతో పాటు పశువులు, మేకలు, గొర్రెలు, పెంపుడు జంతువులకు చిన్న చిన్న సర్జరీలు, గ్రామంలో గృహం వద్దనే చేసేందుకు వీలుగా వాహనాల రూపకల్పన చేశారన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పశువులను తరలించడానికి వాహనానికి హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. పశువైద్యులు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ శశిరేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్, కమిషనర్ ఫణికుమార్, నాయకులు కృష్ణారెడ్డి, సాయికుమార్, ఉస్మాన్, సాధక్ రెడ్డి, మేడా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ నరసింహారావు



సంగం: జగనన్న కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారావు అన్నారు. సంగంలోని 1, 2 లేఅవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ మెట్టుకూరు వాసుదేవరెడ్డితో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో మొదటి, రెండు విడతల కింద 77 వేల ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే సగానికి పైగా గృహ నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కలెక్టర్ చొరవతో గృహ నిర్మాణాలు చేపట్టే వారికి రూ.35 వేలు రుణం అదనంగా అందజేసేలా చూస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణం కోసం స్థలం మంజూరు చేశారని, వారికి నిర్మాణాల కోసం నగదు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కాంట్రాక్టర్లు చేపడుతున్న నిర్మాణాలను తరచూ పరిశీలించుకుని తమ ఇళ్ల నిర్మాణాలు బాగా చేయించుకోవాలన్నారు. డీఈ నటరాజన్, హౌసింగ్ ఏఈ కరిముల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



కావలి ఏరియా ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు వార్డులు, వివిధ విభాగాలు పరిశీలించి వసతులు, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీసి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి అధికారులు, సిబ్బందికి సూచించారు. రోగులకు, రోగులతో వచ్చే సహాయకులకు అవసరమైన అన్నీ సదుపాయాలు కల్పించాలని సూపరింటెండెంట్ సుబ్బారావును ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆస్పత్రిలో అవసరమైన అన్నీ వసతులు, సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అజ్ఞానం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఇటీవల కావలిలో చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మండిపడ్డారు. కావలిలో ఎకరా రూ.ఆరు లక్షలు ఉంటే ప్రభుత్వంతో రూ.50 లక్షలు వంతున కొనిపించి తాను సొమ్ము చేసుకున్నాని ఆరోపించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. కావలిలో ఎకరా రూ.6 లక్షలకు ఎక్కడైనా భూమి దొరుకుతుందా అని ప్రశ్నించారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎంవీఐ రాములు



నెల్లూరుపాళెం సెంటర్‌లో వాహనదారులతో మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి రాములు అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో ముంబయి రహదారిపై శనివారం ఆయన వాహనాలు తనిఖీ నిర్వహించారు. పలువురు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు నిలిపినప్పుడు ఇంజిన్ ఆఫ్ చేయాలని, తద్వారా పర్యావరణంతో పాటు ఇంధనం ఆదా అవుతుందని ఆయన సూచించారు. ఆయన వెంట రవాణాశాఖ సిబ్బంది ఉన్నారు.

కువైట్ కష్టాల నుంచి మహిళకు విముక్తి

- ఇంటికి చేర్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అనుమసముద్రంపేట: పొట్టకూటి కోసం కువైట్‌కు వెళ్లి యజమానుల వద్ద మోసపోయి అనేక కష్టాలు పడుతున్న మహిళను గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదుకున్నారు. ఆమెను సురక్షితంగా భారతదేశానికి చేర్చారు. బాధిత మహిళ మాదాల సునీత సమాచారం మేరకు.. 2019 డిసెంబర్‌లో ఓ ఏజెంట్ ద్వారా వీసా తీసుకుని కువైట్‌కు వెళ్లింది. ఏడాది పాటు అక్కడ పని చేస్తూ రక్షణ లేకపోవడంతో మరో ఇంటికి పని కోసం వెళ్లింది. ఆ సమయంలో మొదటి పనిచేస్తున్న శేట్ ఆమె వీసా, పాస్ట్‌పోర్టు తీసుకుని రూ.2 లక్షలు డబ్బులు తిరిగి చెల్లిస్తేనే ఇండియాకు పంపుతానని ఆమెను ఇబ్బందులకు గురి చేశారు. దిక్కుతోచకపోవడంతో తమ సమీప బంధువైన ఏఎస్‌పేట మండలం చౌటభీమవరానికి చెందిన బత్తల ఏసేమ్మను ఆశ్రయించింది. వారు కువైట్‌లోని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్లు ముమ్మిడి బాలిరెడ్డి, విల్లేస్, లాజరస్‌కు పరిస్థితి వివరించింది. కువైట్‌లోని భారత రాయబారి కార్యాలయానికి తీసుకెళ్లి విషయం తెలపడంతో వెంటనే స్పందించి ఆ మహిళను ఇటీవల ఇండియాకు పంపించారు. ఇబ్బందులు పడుతున్న మహిళలను సురక్షితంగా ఇంటికి చేర్చడంతో ఆ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు పడమటిపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం

సంగం: మండలంలోని పడమటిపాళెం సచివాలయం పరిధిలో ఆది, సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సాయంత్రం 4.30 గంటలకు సంగం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం పడమటిపాళెం సచివాలయం పరిధిలోని గాంధీజనసంఘంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి మిగిలిన ప్రాంతంలో కొనసాగిస్తారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు హాజరు కావలాన్నారు.

గాలీవాన బీభత్సం

- కూలిన సుజలస్రవంతి వాటర్ ప్లాంట్ షెడ్



నందవరంలో పెనుగాలులకు నేలకూలిన సుజల స్రవంతి వాటర్ షెడ్డు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని నందవరం, డీసీపల్లి, రాంపల్లి, రామానాయుడుపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సవం సృష్టించింది. నందవరంలో ప్రజల దాహార్తి తీరుస్తున్న ఎన్‌టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ షెడ్ పెనుగాలుల దాటికి నేలకూలింది. మరొక ఇంటి వద్ద పిట్టగోడ నేలకూలడంతో అక్కడ ఎవరూ లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. రాంపల్లిలో ఒక రేకుల షెడ్డుపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో రేకుల షెడ్డు ధ్వంసమైంది.

పిడుగుపాటుకు మహిళ మృతి



రమాదేవి మృతదేహం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పెదమాచనూరుకు చెందిన ఆకుల రమాదేవి (39) పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గేదెలను, మేకలను మేపుకోవడానికి పొలానికి వెళ్లి ఉండగా పెనుగాలీ వానతో పాటు పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమీపంలో ఉన్న కొందరు గుర్తించి మహిళ మృతదేహం వద్దకు చేరుకుని ఇంటికి తీసుకువచ్చారు. ఆ కుటుంబానికి సహాయక చర్యలు చేపడుతామని మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు తెలిపారు.

అల్లూరులో యువకుడు..



నరేష్ (ఫైల్)

అల్లూరు: పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన ఘటన పొన్నపూడి పెద్దపాళెం పాతూరులో శనివారం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు.. పాతూరులో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో ఏ నరేష్ (28) తన స్నేహితులతో పాటు పక్కనే ఉన్న చెట్టు కిందకు చేరగా ఒక్కసారిగా పిడుగు పడటంతో నరేష్ కుప్పకూలిపోయాడు. మిగిలిన ముగ్గురు తప్పించుకున్నారు. స్థానికులు అతన్ని అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి నెల క్రితమే వివాహమైంది.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చేజర్ల (సోమశిల): మద్యం తరలిస్తున్న షేక్ బాదుల్లా అనే వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై భోజ్యానాయక్ మాట్లాడుతూ పడమటికంభంపాడు క్రాస్‌రోడ్డు వద్ద సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా 39 మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్న బాదుల్లాను గుర్తించి తనిఖీ చేశామన్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితుడిని విచారిస్తున్నామన్నారు.

ఉపాధి కార్యాలయానికి వాటర్ కూలర్ వితరణ



కూలర్‌ను ప్రారంభిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

ఉదయగిరి: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కార్యాలయానికి శనివారం ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి వాటర్ కూలర్‌ను వితరణగా అందించారు. ఏపీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వచ్చే కార్యార్థులు, సిబ్బంది దాహార్తి తీర్చేందుకు ఎంపీపీ కూలర్ ఇవ్వడం అభినందనీయమన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సేవావజ్ర పురస్కారం అందుకున్న వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- వలంటీర్లకు వందనం కార్యక్రమం
- ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు అవార్డుల ప్రదానం

అల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో చేపట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవమిత్ర పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూటలు మోసే ఉద్యోగులంటూ వలంటీర్లను చంద్రబాబు చులకన చేసి మాట్లాడారని గుర్తు చేశారు. పథకాలు అందించి ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని, హేళన చేసిన బాబు, నేడు జగనన్న ఇస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా అందించారని, మీకు న్యాయం చేస్తేనే తమకు ఓటు వేసి మరోసారి ఆదరించాలని జగనన్న కోరుతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే సచివాలయ ఉద్యోగులను, వలంటీర్లను తొలగిస్తారని చంద్రబాబు, లోకేష్ పలు సభల్లో ప్రసంగించారని గుర్తు చేశారు. అనంతరం సేవ వజ్రగా ఎంపికైన నార్త్ మోపూర్ సచివాలయ వలంటీర్ తుమ్మతాటి సురేంద్రను రూ.30 వేలతో పాటు పురస్కారంతో సత్కరించారు. సేవ రత్న, సేవ మిత్ర పురస్కారాలు అందుకున్న 141 మంది వలంటీర్లను శాలువా కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్, కమిషనర్ ఫణికుమార్, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఉస్మాన్, మేడా కృష్ణారెడ్డి, సాధక్‌రెడ్డి, మధురెడ్డి, భాస్కర్, తాండ్ర మల్లి, పోలయ్య, కొండూరు శ్రీనయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

జలదంకి: వలంటీర్ల సేవలు ఎనలేనివని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నడిపిస్తున్న సంక్షేమ పథకాలను నాలుగేళ్లుగా ఎక్కడా ఆగకుండా ప్రతి ఇంటికీ చేరవేస్తున్న సైనికులు వలంటీర్లని కమ్మవారిపాళెం సర్పంచ్ తమ్మినేని సతీష్‌నాయుడు అన్నారు. శనివారం కమ్మవారిపాళెం సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్ వింజం రాజేష్‌కు సేవారత్న అవార్డు అందించారు. మిగిలిన వలంటీర్లకు సేవామిత్ర అవార్డులతో సన్మానించారు. సచివాలయ కార్యదర్శి చవుటూరి సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం సోమశిల సచివాలయ పరిధిలోని వలంటీర్లు సేవావజ్ర రామాయణం సునీత, దాసరి ఆదిలక్ష్మి, సేవా రత్న మీనాక్షిలను శనివారం ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఎం పుల్లయ్య, గ్రామ ఉపసర్పంచ్ షేక్ మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండుబోయిన ఈశ్వరయ్య, సచివాలయ కన్వీనర్ సరస్వతీ, వార్డు మెంబర్ ఉదయగిరి శ్రీనివాసులు, గుండబోయిన కృష్ణయ్య, బాలకృష్ణ, మనోజ్, ఆనంద్, గోపీ చందన, కీర్తన పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రశంసా పత్రాలు

కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 18 మంది వలంటీర్లకు పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వలంటీర్లకు వచ్చిన అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఒకరికి సేవారత్న అవార్డు ఇవ్వగా, మిగిలిన వారికి సేవామిత్ర అవార్డులు అందజేశారు. వీరిని కొమ్మి సర్పంచ్ యారవ అంకమ్మ, వైస్ ఎంపీపీ బండ్లమూడి నాగేంద్రమ్మ శాలువాతో సత్కరించి సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్, అధికారులు



సన్మానం అందుకున్న కమ్మవారిపాళెం వలంటీర్లు



వలంటీర్ల సన్మానిస్తున్న నాయకులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలో అనారోగ్య కారణాలతో ఆర్థికంగా చితికి పోయిన తొమ్మిది కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. కావలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు రూ.10.14 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. వీరిలో కోవిడ్ సమయంలో తీవ్రంగా అనారోగ్యానికి గురైన ఓ చిన్నారి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కులను అందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ చిన్నారి పరిస్థితి చూసి సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో ఏకంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఆ చెక్కును చిన్నారి తల్లికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా అండగా నిలిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా బోగోలు మండలానికి చెందిన వ్యక్తి కోవిడ్ సమయంలో తీవ్రంగా అనారోగ్యానికి గురై తన ఎనిమిది ఎకరాల పొలం అమ్మి చికిత్సకు రూ.కోటికి పైగా ఖర్చు చేయడంతో సీఎం సహాయ నిధి నుంచి అత్యధికంగా రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు అండగా నిలిచే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. కావలి నియోజకవర్గంలో కూడా సీఎం చొరవతో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నట్లు వివరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- మెట్టుకూరు ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. చిన్నఅన్నలూరు ఎస్సీ కాలనీలో గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో 53 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ నేతలు పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం సిగ్గు చేటన్నారు. నీచ రాజకీయాలు చేస్తున్న టీడీపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగాలంటే 2024లో జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సోమశిల ఉత్తరకాలువ ద్వారా ఈ ప్రాంతంలోని చెరువులకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రాగి కుమారి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంగళరెడ్డి, అంకిరెడ్డి, ఇర్మియా పాల్గొన్నారు.

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి

- మంత్రి పెద్దిరెడ్డికి వినతి



మంత్రి పెద్దిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆత్మకూరు: ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి హరి, ఎస్‌డీ రసూల్‌సాహెబ్, చంద్రమౌళి ఆధ్వర్యంలో తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఆరోగ్య శాఖలో పలువురికి రెండేళ్ల క్రితం ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. జీఓ నంబరు 60, 63 విధానాల మేరకు నియమింపబడిన అభ్యర్థులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఎస్. పవన్‌కుమార్, విజయ్ శేఖర్, షకీల, హరనాథ్, వర్మ పాల్గొన్నారు.